క్లుప్తంగా

రేపు తెనాలిలో దివ్యాంగుల పరికరాల గుర్తింపు శిబిరం

తెనాలిఅర్బన్: కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పంపిణీ చేసే పరికరాల గుర్తింపు శిబిరాన్ని గురువారం తెనాలిలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. చేతికర్రలు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్‌లు, రోల్‌టైర్స్, అంధుల చేతికర్ర, లెప్రెసి కిట్స్, కృత్రిమ అవయవాలు మొదలగు వాటిని ప్రభుత్వం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనిలో భాగంగా తెనాలిలో దివ్యాంగులకు పరీక్షలు జరిపి అవసరమైన పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. క్యాంప్‌కు వచ్చే సమయంలో సదరమ్ సర్టిఫికెట్, తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, యూనిక్ డిజైబుల్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, సెల్ ఫోన్ తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తెనాలి పరిధిలో ఉన్న దివ్యాంగులు ఉపయోగించుకోవాలన్నారు.

నేడు శ్రీవాసవి అమ్మవారి జన్మదినోత్సవం

తెనాలి: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం అయిదు గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలను ఆరంభిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఆరున్నర గంటలకు వైశ్య పతాకాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత గణపతి పూజ, పుణ్యాహావాచనం, పంచగవ్య ప్రాసనం చేస్తారు. 8.30 గంటలకు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 11 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం, అలంకారాలు చేస్తారు. 10.30 గంటలకు ముత్తయిదువులచే సామూహిక కుంకుమార్చనలు, 11 గంటలకు వాసవీ అమ్మవారి మూలమంత్ర హోమం, 12 గంటలకు మహామంగళ పూర్ణాహుతి, తీర్థప్రసాదాల వినియోగం ఉంటాయి. సాయంత్రం 5.30 గంటలకు సామూహిక లలితా సహస్రనామ పారాయణం, రాత్రి ఏడు గంటలకు దివ్య రథోత్సవం, ఊరేగింపు ఉంటాయి. చివరగా రాత్రి తొమ్మిది గంటలకు ఊంజలసేవ, పవళింపుసేవ, నీరాజన మంత్ర పుష్పములుతో ఉత్సవం పూర్తవుతుందని నిర్వాహకులు వివరించారు

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: చెంచుపేట ఆర్‌పీఎం క్లబ్ వైపు చేపట్టిన ఆక్రమణల తొలగింపు మంగళవారం కొనసాగింది. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీతో మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణాలన్ని తొలగించారు. ఈ సందర్భంగా టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ టీటీడీ కల్యాణ మండపం వరకు మొదటి విడత కింద తొలగింపు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ వాణి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు

జిల్లా విద్యాశాఖాధికారిణి టి.వి.రేణుక

సాక్షి ఎఫెక్ట్

తెనాలిఅర్బన్: తెనాలి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నిలిచిపోయిన నాడు-నేడు పథక పనులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి టి.వి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రిలో మంగళ వారం నిధులు ఉన్న నిలిచిన నాడు-నేడు పనులు అనే శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించి ఆమె ప్రభుత్వం ఇటీవల జిల్లాల్లో నాడు-నేడు పనుల నిమిత్తం రూ.7.39 కోట్లు విడుదలు చేసిందని తెలిపారు. ఆ నిధులతో నాడు-నేడు పనులు పూర్తి చేస్తామన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

నవులూరు(మంగళగిరి):మండలంలోని నవులూరు గ్రామంలో షారోన్ అనాథ ఆశ్రమంలోని బాలికలకు అన్నదానం నిర్వహించారు. బుధవారం కాంగ్రు కోమల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత కోమల్ కుమార్, రిషిత శ్రీ దంపతులు, బాపనపల్లి శివరాం, మురికిపూడి నరేష్, సింగరాజు, సాయి, అర్వగట్ల పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన డీఏను కొనసాగించాలి

తాడేపల్లి రూరల్: వీఆర్‌ఏలకు పెంచిన డీఏను కొనసాగించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రాతూరు ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో రూ.300 ఉన్న డీఏను రూ.500 వరకు పెంచారని, పెంచిన డీఏను ఆరు నెలలు ఇచ్చి అనంతరం ఆపేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాభిప్రాయసేకరణ మేరకే ఇసుక తవ్వకాలకు అనుమతులు

జిల్లా రెవెన్యూ అధికారి కాజావలి



పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయసేకరణ సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వోకాజావలి

కొల్లిపర: ప్రజల అభిప్రాయ సేకరణ మేరకే పట్టా భూముల్లో ఇసుక తవ్వటానికి అనుమతులు ఇవ్వనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కాజావలి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ సదస్సునుఎన్విరాల్‌మెంట్ క్లిరెన్స్‌టీమ్ సంబంధించిన అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజావళి మాట్లాడుతూ బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లో 6.92 హెక్టార్లల్లో రైతులు పట్టా భూముల్లో మేట వేసిన ఇసుకను తొలగించేందుకు అనుమతులు కోరినట్లు తెలిపారు. ఇసుకమేటను తొలగింపుకు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు ప్రజాభిప్రాయసేకరణ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టా భూముల్లో ఇసుక తొలగింపునకు ఏమైనా పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందా లేదా అని అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు తెలియజేయాలన్నారు. దీంతో గ్రామస్తులు, రైతులు ఎటువంటి అభ్యంతరాలు లేవని అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎన్విరాల్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సజీనాబేగం మాట్లాడుతూ గ్రామస్తులు, రైతులు నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేనందున సదస్సును ముగించినట్లు తెలియజేశారు. సదస్సులో ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ కొల్లి రజనీ, మైనింగ్ డీడీ ప్రకాశ్‌కుమార్, ఆర్ఐ ఆంజనేయులు, ఇరిగేషన్ ఏఈ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండాక వివాహాలు చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

తెనాలిఅర్బన్: ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహాలు జరిపించాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ సూచించారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా పాత ప్రభుత్వ వైద్యశాలలోని డిప్యూటీ డీఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో ప్రాథమిక దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆశా యాప్‌లో, రికార్డుల నిర్వాహణపై సూచనలిచ్చారు. గర్భిణీ నిర్ధారణ కిట్లను ఉపయోగించే విధానాన్ని, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గుంటూరు రమేష్ హాస్పటల్ గైనాకాలిస్ట్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ గర్భిణీలపై నిత్యపర్యవేక్షణ ఉండాలన్నారు. వారికి సంభవించే ప్రమాదకర లక్షణాలను వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమేష్ హాస్పటల్ మేనేజర్ శివసంతోష్, అర్బన్‌హెల్త్ సెంటర్ ఆరోగ్య పర్యవేక్షకులు టి.వెంకటేశ్వరమ్మ, సిహెచ్.ప్రసన్న పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

తెనాలి: కిశోర వికాసం కార్యక్రమం మంగళవారం పట్టణ 22వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డాక్టర్ ఎం.సునీత మాట్లాడుతూ కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలు ఈనెల రెండో తేదీనుంచి జూన్ 10వ తేదీవరకు ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని గ్రామాల్లో కిశోర బాలికల (11–18 ఏళ్ల వయస్కులు)కు జరుగుతాయని తెలిపారు. ఆ వయసులోని బాలికలకు వారి హక్కులు, సమస్యలు, వ్యవస్థలపై అవగాహన, సాధికారితను కల్పిస్తారు. కార్యక్రమంలో భాగంగా రుతుస్రావం, పరిశుభ్రత, లైంగిక విద్యపై అవగాహనను కల్పించారు. రుతుక్రమంలో పాటించాల్సిన శుభ్రతపై డాక్టర్ సునీత బాలికలకు వివరించారు. సూపర్‌వైజర్ వై.నాగమణి కిశోరి బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారాన్ని తెలియజేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నుంచి అజయ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమ కన్వీనర్ ఎంఎస్‌కే, ఎన్ఎం, ఆశా, కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి



మెడికల్ ఆఫీసర్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

రేపల్లె: ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనంకు రూ.26,000 అందించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. ప్రమాద భరితమైన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశాలు పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం గురువు రోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్లో మెడికల్ ఆఫీసర్ రమేష్‌కు సమ్మె నోటీసులు అందజేసి ఆయన మాట్లాడారు. నిరంతరం శ్రమించే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా కార్మికులను కట్టు బానిసలాగా మార్చే లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం దారుణం అన్నారు. 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశాలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. సర్వేలు, ఫోన్ యాప్ సర్వేలు, రికార్డుల పేరుతో తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. ఆశావర్కర్ల ఒప్పంద జీవోలను విడుదల చేయాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఆశాల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని విశ్వేశ్వరం, మెళ్ళగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఆయా పీహెచ్‌సీలలోని డాక్టర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ వీరలక్ష్మి, వి.కమలాదేవి, గ్లోరీ, పావని, సీఐటీయూ నాయకులు కే ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ఫిరంగిపురం: కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న నిర్వహించే అఖిల భారత సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని కార్మికవర్గం వందేళ్లకు పైగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నష్టం కలిగించేలా లేబర్ కోడ్‌లను తీసుకు వస్తుందని చెప్పారు. దీంతో కార్మిక వర్గం తిరిగి బానిసత్వంలోకి నెట్టనుందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం చేసిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలు కూడా ఇవ్వడంలేదని.. దీనిపై ఉమ్మడి పోరాటానికి సిద్ధపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం రెండు పీహెచ్‌సీల వైద్యులు యానీగ్రేస్, శ్వేతలకు అఖిల భారత సమ్మెనోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, పద్మలు పాల్గొన్నారు.

పాటకు సమస్యలపై కదిలించే శక్తి

లక్ష్మీపురం: సమస్యలపై ప్రజలను కదిలించగలిగే శక్తి ఒక పాట ఒక నాటికకు ఉందని సీఐటీయూ నాయకులు వై.నేతాజీ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అడవితక్కెలపాడు పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కార్మికుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, నిత్యావసరాల ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూ-అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు నృత్యాలు చేశారు. సీఐటీయూ నాయకులు జి.లూథర్ పాల్, సిహెచ్ కిన్నర్ అభ్యుదయ గీతాల ఆలపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్ బాషా, సిపాన పద్మనాభుడు, బి.సుకన్య, ట్రీ ట్యూషన్ సెంటర్ టీచర్ కె.సుజాత పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

మంగళగిరి టౌన్: మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో గత నెల 24వ తేదీన గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడగా వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను విచారించగా మరో ముగ్గురు వారితో ఉన్నట్లు తెలిపారు. సేకరించిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో 'ఈగల్ టీమ్' మంగళగిరి పట్టణ పోలీసుల గంజాయి కలిగిన ఇద్దరి యువకులను గత నెల 24న కనుగొని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు తమతో ఉన్నారని.. వారిలో మంగళగిరి బాపనయ్య నగర్‌కు చెందిన పవన్, నవులూరుకు చెందిన మరో ఇద్దరు యువకులు ఉన్నట్లు నిందితులు తెలిపారు. పవన్ ఇంట్లో ఉన్నారన్న సమాచారంతో పట్టణ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన మరో ఇద్దరి యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విద్యా హక్కు చట్టం సద్వినియోగం చేసుకోవాలి



కొల్లిపర: ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం ఒకటవ తరగతి నుంచి ఉచిత విద్య కోసం ప్రవేశపెట్టిన విద్య హక్కు చట్టం 12 బై వన్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సాల్మన్ రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో విద్యాహక్కు చట్టం పై అవగాహన కోసం హెల్ప్ లైన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ద్వారా నిరుపేదలు ఒకటవ తరగతిలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఉంటే అర్హత పొందిన వారు వారి పిల్లలను ఒకటి నుంచి 10వ తరగతి వరకు వారికి ప్రభుత్వం కేటాయించిన ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా విద్యా బోధనలు అందుకోవచ్చని తెలిపారు. విద్యకు చట్టంపై ఎటువంటి అనుమానాలు ఉన్న హెల్ప్ లైన్ డెస్క్ వద్దకు వచ్చివారి అనుమానాలను తీర్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుపేదలు ఉపయోగించుకోవాలని కోరారు.

కూలీలకు కనీస వేతనం అందించాలి



దుగ్గిరాల: వేసవిలో ఉపాధి హామీ కూలీలకు మంచినీళ్లు కూడా ఇవ్వడంలేదని గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సీపీఎం నాయకులు జెట్టి బాల రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దకొండూరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీల సమ్యసలు తెలుసుకునేందుకు మంగళవారం కూలీల పని ప్రదేశానికి ఆయన వెళ్లారు. కనీసం మంచి నీరు, మజ్జిగ గతంలో ఇచ్చేవారని.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కె.సంసోను, కె.నాగరాజు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన నేడు



రామచంద్రాపురం(మంగళగిరి):మండలంలోని రామచంద్రాపురంలో కొలువైయున్న శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన బుధవారం నిర్వహించనున్నట్లు భక్త బృందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జూనియర్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కమిషనర్ చావలి సునీల్

మంగళగిరి, మంగళగిరి టౌన్: రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ వేళంగిణి కుటుంబానికి రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. వేళాంగిణి సోదరి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు భర్త మృతి చెందడం, ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని సమాచారం అందుకున్న కమిషనర్ ఆమెకు రూ.25 వేలు అందజేశారు. పిల్లల చదువులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చినట్లు వేళాంగిణి తెలిపారు. కార్యక్రమంలో పీఎస్. ఫణీంద్ర, డి.ఇ.వోలు వరప్రసాద్, వెంకట్, ఇందిర పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మహిళాల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 15,16, 27 వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డోర్ టు డోర్ కలెక్షన్ నూరు శాతం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్లపై ఎక్కడ చెత్త కనిపించకూడదన్నారు. ప్రజలు కూడా ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను కాల్వలో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నెహ్రూనికేతన్‌కు ఉత్తమ పాఠశాల పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న మురళీకాంత్, గీతాకాంత్

తెనాలిఅర్బన్: లీడ్‌స్కూల్ ఆధ్వర్యంలో తెనాలి బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలకు దక్షిణ భారతదేశంలోనే ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని అందుకున్నట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో లీడ్ స్కూల్ వ్యవస్థాపకులు సుమిత్ మెహతా, వైస్ ప్రెసిడెంట్ దీపక్ హరిహరన్‌లు పురస్కారానికి సంబంధిన మెమోంటోలు అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో తమ పాఠశాల ఉత్తమ పాఠశాలగా పురస్కారాన్ని అందుకోవడం సంతోషాన్ని కలిగించిందన్నారు. మరింత బాధ్యతతో పనిచేస్తూ మరిన్ని అవార్డులో అందుకునే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అవార్డును అందుకున్న ఎండీ మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లను మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న సుజాత

కొల్లిపర: ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకొని తద్వారా అధికారులు తెలిపిన విధంగా పంట భూమిలో సేంద్రియ ఎరువులు వాడాలని తద్వారా భూసారం పెరిగి తక్కువ ఖర్చుతోఅధిక దిగుబడులు సాధించవచ్చని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి సుజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట గ్రామంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులు, ఏరువాక కేంద్రం, లాంఫాం గుంటూరు వారి ఆధ్వర్యంలో రైతు సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన యుద్ధ అంశాలను అధికారులు శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్.వెంకటలక్ష్మి, కోఆర్డినేటర్ ఏరువాక కేంద్రం డాక్టర్ సి.సంధ్యారాణి, ప్రధాన శాస్త్రవేత్త కీటక శాస్త్రం డాక్టర్ దయానా గ్రేస్, డాక్టర్ సి.హెచ్.సుజని రావు, డాక్టర్ ఎం.వెంకట రాములు, రైతులకు పంటలో ఆశించి చీడ పీడ పురుగుల గురించి వాటి నిర్మూలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

విపత్తులతో రైతులు నష్టపోతున్నారు

- పంట నష్టం పరిశీలనకు అధికారులెవరూ రాలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పడిపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న రామకృష్ణ

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈదురు గాలులు, వడగండ్ల వానలు, ఇతర విపత్తుల వల్ల రైతులు పంట నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం స్పందించి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో అకాల వర్షంతో నేలకొరిగిన అరటి తోటలను ఆయన రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ఎకరాలలో వరి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం జరిగిందని.. మరో 2 వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ఈ లెక్కలు ప్రభుత్వమే చెప్పిందని అన్నారు. సీఎం చంద్రబాబు 24 గంటల్లో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా పంటలకు నష్టం జరిగితే ఒక్క అధికారి కూడా రాకపోవడం, పంటలను పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, సుహాస్, గుంటక సాంబిరెడ్డి, జవ్వాది సాంబశివరావు, సింగయ్య, రైతులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ నేతలు, సభ్యులు

లక్ష్మీపురం: సీహెచ్‌ఓల సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సీహెచ్‌ఓల ఆందోళన తొమ్మిదో రోజుకు చేరింది. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి నగరంపాలెం మీదుగా గుర్రం జాషువా విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు విధులు నిర్వహించిన అనంతరం రెగ్యులరైజ్ చేస్తామని రాతపూర్వకంగా ఉద్యోగస్తులకు హామీ ఇచ్చి, నేడు దాన్ని అమలుపరచుకుండగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నెహ్రూ నగర్: కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం, పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబుని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 8వ శానిటరీ డివిజన్‌లో కార్మికుల హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, సదరు కార్మికులు విధుల్లో లేరని గుర్తించినట్లు చెప్పారు. సదరు డివిజన్‌లో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో కూడా శానిటరీ ఇన్ స్పెక్టర్ రాంబాబు నిర్లక్ష్యంగా కనిపిస్తోందని చెప్పారు. 8 డివిజన్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.బాబుని నియమించామన్నారు.